క్లుప్తంగా

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న ఎంవీఐ ఠాకూర్ ఈశ్వర్‌సింగ్

హుజూరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉంటుందని హుజూరాబాద్ ఎంవీఐ ఠాగూర్ ఈశ్వర్‌సింగ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినవారిని సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. డిపో నుంచి బస్సులను బయటికి తీసే సమయంలో బస్సు కండిషన్ పరిశీలించుకోవాలని, బస్సును నడిపే సమయంలో ట్రాఫిక్‌రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలో పద్మశాలీ సంఘం క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు సంగెం సత్యనారాయణ మాట్లాడుతూ.. అభ్యున్నతి కోసం పద్మశాలీలందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. అట్టడుగున ఉన్న పద్మశాలీ కుల బాంధవులను గుర్తించి జీవన ప్రమాణాలకు ఆర్థికసాయం అందించే విధంగా ప్రభుత్వం ద్వారా నేతన్నలకు ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి జడల చిరంజీవి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, నాయకులుశ్రీనివాస్, సబ్బని రాజేందర్, బండారి సదానందం, కుడికాల సాయి తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న పశువైద్యుడు

రామడుగు: మండలంలోని దత్తోజిపల్లి, రంగసాయిపల్లి గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు వివిధ రకాల చికిత్సలు చేశారు. వివిధ సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీఏ లింగారెడ్డి, బోధనానిపుణులు విజయ్‌కుమార్ శర్మ, ఎస్పీ రెడ్డి, రాజిరెడ్డి, కోటేశ్వర్‌రావు, సాయిచైతన్య, దివ్య, వీఎల్‌వో గిరిధర్, వీఏ శంకర్, సర్పంచ్ బండ అజయ్‌రెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు గంట్ల రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న సైంటిస్టులు

శంకరపట్నం: మండలంలోని వరి పంటలను బుధవారం సైంటిస్టులు పరిశీలించారు. జింక్ లోపం, మొగిపురుగు సోకే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. చేనులో అధిక నీరు ఉండకుండా, రోగాలు సోకకుండా ఎప్పటికప్పుడు పంటను పరిశీలించాలన్నారు. ఈకార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సజీవరెడ్డి, ఏఓ శ్రీనివాస్, సైంటిస్టులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఏవో

గంగాధర: మండలంలోని గంగాధర, గర్శకుర్తి గ్రామాలలోని ఎరువులు, మందుల దుకాణాలను తహసీల్దార్ జి రమేశ్‌బాబు, వ్యవసాయ అధికారి రాజు బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు రైతులు కొనుగోలు చేసే ఎరువులు, పురుగుల మందులకు రశీదులు ఇవ్వాలని సూచించారు.

విస్తరణ ఆగి.. ఇరుకుగా దారి

- చొప్పదండి పట్టణంలో పాత రోడ్డుపైనే డివైడర్ నిర్మాణం
- వాహనాల రాకపోకలకు ఇబ్బంది
- నిత్యం ప్రమాదాలు.. ఇప్పటికే పలువురి మృతి
- అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై విమర్శలు

'వంద ఫీట్ల రోడ్డుగా మారుస్తామన్నారు.. మూడేళ్లు ఊరించి, ఎట్టకేలకు పనులు ప్రారంభించారు.. కానీ మధ్యలోనే వదిలేశారు.. రోడ్డు వెడల్పు అవుతుందనుకుంటే డివైడర్ నిర్మాణంతో ఇరుకుగా మారింది.. ఎన్నికల ముందు రోడ్డు పనులతో హడావుడి చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు ఇప్పుడు కనిపించకుండా పోయారు.. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చొప్పదండి పట్టణ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.'



చొప్పదండి: పట్టణాన్ని సెంట్రల్ లైటింగ్‌తో సుందరీకరిస్తామని, రోడ్డు విస్తరించి, నగరాలకు దీటుగా చేస్తామని చేపట్టిన పనులు అభాసుపాలవుతున్నాయి. శంకుస్థాపన చేసిన కొన్ని నెలలకు ప్రారంభించగా చేసిన పనుల్లో నాణ్యతపై విమర్శలు వచ్చాయి. ఆపై రోడ్డు కొలతల్లోనూ తేడాలున్నాయంటూ పలువురు ఆరోపించారు. ఝాన్సీ స్కూల్ నుంచి నవోదయ స్కూల్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులని చెప్పి, గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి డీ–86 కాలువ వరకే చేపట్టారు. చివరకు గతంలో ఉన్న 10 మీటర్ల తారు రోడ్డుపై డివైడర్ నిర్మించి, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితిని తీసుకువచ్చారు. ఇప్పుడు ప్రభుత్వమే మారడంతో పనుల నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ముందే డివైడర్ నిర్మాణం

చొప్పదండి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టగా మున్సిపల్ అధికారులు 110 అడుగుల మేర రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేశారు. సెంటర్ పాయింట్ నుంచి ఇరువైపులా 55 అడుగుల మేర రోడ్డును అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆశించారు. తీరా అధికారులు 100 అడుగుల మేరకే డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో విస్తుపోయారు. 100 అడుగుల రోడ్డు పోనూ ఇరువైపులా 5 అడుగుల చొప్పున ఉండాల్సిన సెట్ బ్యాక్ స్థలం కబ్జాకు గురవడంతో ఉన్న రోడ్డునే అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యాక కరెంటు పోల్ టవర్స్ నిర్మించి, ప్రస్తుతం ఉన్న స్తంభాలు తీయాల్సి ఉంది. ఈ పనులు పూర్తి కాలేదు. విద్యుత్ పనులు పూర్తయ్యాక తారు రోడ్డును విస్తరించాల్సి ఉంది. ఇవేమీ లేకుండానే రోడ్డు పనులు నిర్వహిస్తున్న అధికారులు డివైడర్ నిర్మాణం పూర్తి చేశారు. ఇరువైపులా కనీసం 7 మీటర్ల మేర రోడ్డు వేశాక డివైడర్ నిర్మించాల్సి ఉంటుంది. కానీ, అధికారులు రోడ్డుతో సంబంధం లేకుండా డివైడర్ నిర్మించి, ప్రయాణికులకు దినదిన గండంగా మార్చేశారు. విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడం, మట్టి కుప్పలు పూర్తిగా తీయకపోవడం, మట్టి రోడ్డు గుంతలుగా మారడం, రోడ్డుపై వాహనాల పార్కింగ్, పలుచోట్ల చిరువ్యాపారులు రోడ్డును ఆక్రమించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు మృతిచెందారు.

సుమారు రూ.33 కోట్లు మంజూరు

సెంట్రల్ లైటింగ్ పనులను రాష్ట్ర పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా రుణం తీసుకొని నిర్వహిస్తున్నారు. సుమారు రూ.33 కోట్లు మంజూరు చేయగా, సీఎస్టీ, జీఎస్టీలు పోను రూ.24 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో పనులు చేపట్టగా, కొన్ని బిల్లులు కూడా మంజూరైనట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులకు బ్రేక్ పడింది. పనులు నిలిచిపోయి, రోడ్డు ఇరుకుగా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విస్తరించకుండానే డివైడర్ ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులపై ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

> **పనులు కొనసాగుతాయి..**
>
> రోడ్డు పనులు చేస్తున్న కూలీలు సంక్రాంతి పండుగకు తమ సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారని తెలిసింది. కాంట్రాక్టర్లు ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. స్తంభాలు వేసి, రోడ్డు విస్తరించాల్సి ఉంది. పనులు కొనసాగుతాయి.
>
> – శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

మిర్చీలు తింటూ ఆప్యాయంగా పలకరించిన కేటీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

తిమ్మాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే బుధవారం కరీంనగర్ పర్యటనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి స్టేజీ వద్ద కాసేపు ఆగారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేశ్ బాగున్నావా అంటూ కేటీఆర్ ఆప్యాయంగా పలకరించారు. రోడ్డు సైడ్ హోటల్లో మిర్చి, బజ్జీలు తిని, టీ తాగుతూ కాసేపు ముచ్చటించారు. మండలంలో పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్ కుమార్ గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి అండగా ఉంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పీఆర్టీయూ కరీంనగర్ జిల్లాశాఖ రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలు, పండిట్, పీఈటీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్‌రెడ్డి,కేతిరి తిరుపతిరెడ్డి, హుస్సేన్,వొడ్నాల శ్రీనివాస్, మొగిలి కాంతయ్య, చొక్కయ్య తదితరులు ఉన్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయానికి పక్కా భవనాలు నిర్మించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందించారు. గతంలోనే ఏడెకరాల భూమిని మంజూరు చేశారని, గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సంబోజి శేఖర్ తెలిపారు. వెంట వైస్ ప్రిన్సిపాల్ దీప్తి, వెంకటేశ్, శంకర్, అజయ్, సుధాకర్, సదానందం, తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య

హుజూరాబాద్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పి. అలేఖ్య అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని న్యూ కాకతీయ ఇ. మీ స్కూల్‌లో బుధవారం మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికలనుద్దేశించి మాట్లాడుతూ.. చదువు, అభివృద్ధి, పిల్లల హక్కులు, చట్టాల గూర్చి అవగాహన కల్పించారు. సదస్సులో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ యతిపతి అరుణ్‌కుమార్, లోక్ అదాలత్ మెంబర్ ఐలయ్య, అడ్వకేట్ మాదవి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఉన్నారు.

నిర్మిత కేంద్రంలో లైబ్రరీ



భవనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని నిర్మిత కేంద్ర భవనంలో లైబ్రరీ ఏర్పాటు అవకాశాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం పరిశీలించారు. భవనంలో గదులు, సౌకర్యాలు, కల్పించాల్సిన వసతులు తదితర వివరాలను ఎంపీడీవో, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్నీ అనుకూలంగా ఉంటే లైబ్రరీ ఏర్పాటు చేయాలని సూచించారు. వెంట ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు ఉన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై బుధవారం అవగాహన సమావేశం జరిగింది. బాలల పరిరక్షణ కోసం కమిటీల ఏర్పాటు, విధి విధానాలు, బాలల చట్టాలు, బాలకార్మిక, బాల్యవివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యల నిర్మూలన, విద్యాహక్కు, వివిధ చట్టాలపైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే 18 సంవత్సరాల లోపు పిల్లలకు సంబంధించిన సమస్యలు డయల్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, సీడీపీవో భాగ్యలక్ష్మి, ఎస్ఐ సాంబయ్య, ఎంపీవో వేముల సురేందర్, సూపర్‌వైజర్ తిరుపతమ్మ, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సూపర్‌వైజర్ దూడం కుమారస్వామి, ఆర్ఐ రంజిత్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



సన్మానిస్తున్న హన్మండ్ల భాస్కర్

గన్నేరువరం: ఆధ్యాత్మికత అలవర్చుకుంటే ప్రశాంతమైన జీవితం గడపవచ్చని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని గునుకులకొండాపూర్ శ్రీహనుమాన్ ఆలయంలో అఖండ రామనామ సంకీర్తనలు, సుమారు 1200 మంది రామ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన రామ భక్తులను బుధవారం శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే ఆలయానికి గుండ్లపల్లి సర్పంచ్ బెతెల్లి సమత రూ.ఐదువేల విరాళం ఇవ్వగా రామ భక్త బృందంతో కలిసి వారి కుటుంబసభ్యులను సన్మానించారు. భక్తి పారవశ్యంలో ఉన్నవారు క్రమశిక్షణతో మెలుగుతూ సన్మార్గంలో నడుస్తారని తెలిపారు. కార్యక్రమంలో బెతెల్లి రాజేందర్‌రెడ్డి, కొర్వి తిరుపతి, సమ్మయ్య, నర్సయ్య, ప్రభాకర్ రెడ్డి, శంకర్, లక్ష్మణ్, రాజు, సమ్మయ్య, మల్లేశం, రవి, బొందయ్య, ఆలయ పూజారి కనపర్తి శేఖరాచార్యులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 21 వేల విరాళం



విరాళం అందజేస్తున్న అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి

మండలంలోని మైలారం గ్రామం శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి రూ.21 వేల విరాళం ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మల్లేశం, డీసీసీ అధికార ప్రతినిధి సునీల్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, గ్రామ అధ్యక్షుడు రాముడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరిపూర్ణాచారి, నర్సయ్య, రాజిరెడ్డి, రాజు, పర్శరాములు, నాగరాజు, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో బొంతుపల్లి వాసులు

వీణవంక: వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవస్థానంలో సేవ చేసేందుకు మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన 17 మంది భక్తులు బుధవారం తరలివెళ్లారు. ఒక్కరోజు సేవా కార్యక్రమంలో భాగంగా స్వామివారి హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. గతంలో తిరుపతి, యాదగిరిగుట్ట, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో సేవ చేయడానికి గ్రామం నుంచి 38 మంది భక్తులు తరలివెళ్లినట్లు భక్తులు బావు సంపత్ తెలిపారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని సేవ చేయడానికి వెళ్తున్నామని వివరించారు.

వ్యాపారుల సన్మానం



జమ్మికుంట: పట్టణంలోని అడ్తిదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని అడ్తి, ఖరీదు వ్యాపారులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అడ్తిదారులు, ఖరీదు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఖరీదు వ్యాపారులు భాస్కర్, శివన్న, వీరన్న, నారాయణ, రవీందర్, బాబన్న, శ్యామ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కోశాధికారి సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌కు..



నవీన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కృష్ణారెడ్డి

చొప్పదండి: ఇటీవల తెనాలిలో జరిగిన సౌత్‌జోన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని రాగంపేటకు చెందిన తీగల నవీన్‌గౌడ్ పాల్గొన్ని కాంస్య పతకం సాధించాడు. గ్రామస్తులు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్టారెడ్డి బుధవారం నవీన్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. దక్షిణ భారత క్రీడా పటంలో రాగంపేట గ్రామాన్ని నిలిపినందుకు నవీన్‌తో పాటు కోచ్ భీమనాతిని మల్లేశంను అభినందించారు. ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు తెనాలి జేఎంజే కళాశాలలో జరిగిన పోటీల్లో నవీన్ పతకం సాధించినట్లు కోచ్ తెలిపారు. కార్యక్రమంలో నరేశ్, ఎరుకల తిరుపతి గౌడ్, వెంకటేశ్, యాంసాని శ్రీనివాస్, సిరవేని రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

28న పీవీ జిల్లా సాధన సదస్సు

జమ్మికుంట: పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన సదస్సుకు తరలిరావాలని జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ బిమోజు సదానందం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 28న హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో సదస్సు నిర్వహించనున్నామని, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారని అన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట, కమలాపూర్, ఇల్లందకుంట, వీణవంక మండలాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, సామాజిక రాజకీయ వేత్తలు, వ్యాపారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, గొడిశెట్టి వెంకట్రాజం, ప్రభాకర్, అలేటి రవీందర్, రాం సారయ్య, జమ్మికుంట జెడ్పీటీసీ శ్రీరామ్‌శ్యామ్, దూడపాక శ్రీనివాస్, బోయిని నారాయణ, మాదాసు మొగిలి, వీరన్న, బొమ్మకంటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: సదస్సును విజయవంతం చేయాలని సాధన సమితి నాయకులు కోరారు. మండల కేంద్రంలో సదస్సు కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు సదస్సులో పాల్గొనాలని కోరారు. నాయకులు సదానందం, విద్యాసాగర్‌రెడ్డి, రేగుల అశోక్, వెంకటేశ్ ఉన్నారు.

నేడు ఓటరు దినోత్సవం

వీణవంక: మండలంలోని బీఎల్‌వోలు గురువారం నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ తిరుమల్‌రావు ప్రకటనలో కోరారు. ఉదయం పోలింగ్ బూత్‌ల్లో దినోత్సవం నిర్వహించాలని సూచించారు.

రైతులపై వివక్ష తగదు

వీణవంక: రైతుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాకలో బుధవారం మాట్లాడారు. రైతుబంధు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాలో జమకాలేదని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆరోపించారు. దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలి కోరారు.

అర్చకులకు ఆరోగ్యబీమా అమలు చేయాలి

చొప్పదండి: రాష్ట్రంలోని అర్చకులకు రూ.ఐదు లక్షల ఆరోగ్యబీమా అమలు చేయాలని డీడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాచలం ప్రభాకరాచార్యులు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు సంపత్ కుమారాచార్యులు బుధవారం రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. అర్చక వెల్ఫేర్ బోర్డు నుంచి అర్చకులకు రుణాలు అందించేందుకు కృషి చేయాలని, యాభై ఏళ్లు నిండిన అర్చకులకు ప్రత్యేక ఆసరా పింఛన్లు, ప్రభుత్వ ఆరు గ్యారంటీల పథకాల్లో అర్చకులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో హరిదాసు హరికృష్ణ, చక్రపాణి, జనగామ సత్యనారాయణ, తదితరులున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చొప్పదండి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు సకాలంలో హాజరుకావాలని కోరారు. వివిధ శాఖల సమాచారం అధికారులు అందుబాటులో ఉంచాలని కోరారు.

జిల్లా సహకార సంఘం సభ్యత్వం పొందాలి

సైదాపూర్: జిల్లా మత్స్య సహకార సంఘంలో గ్రామ మత్స్య సహకార సంఘాలు ఫిబ్రవరి 15 లోపు సభ్యత్వం పొందాలని జిల్లా మత్స్య సహకార సంఘం ప్రధాన కార్యదర్శి పెసరు కుమారస్వామి బుధవారం ప్రకటనలో కోరారు. జిల్లా మత్స్య సహకార సంఘం రిజిస్ట్రేషన్ కోసం తాత్కాలిక కమిటీ ఎన్నుకున్నామని, ఐదేండ్ల కమిటీ ఎన్నికకు జిల్లాలోని 188 గ్రామ సహకార సంఘాలు రూ.1500 చెల్లించి, సభ్యత్వం తీసుకోవాలని లేదంటే ఓటు హక్కు ఉండదని పేర్కొన్నారు.


మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

హుజూరాబాద్: యువత మహనీయులను ఆదర్శంగా తీసుకొని నిర్దేశిత లక్ష్యంతో ముందుకెళ్లాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్లు పూసాల విష్ణు, రాంప్రసాద్ కోరారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానం ఏబీవీపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని వారం రోజులుగా నిర్వహిస్తున్న యువజనోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. వారి పోరాట స్మృతులను గుర్తు చేసుకున్నారు. నేటి యువత, విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడోత్సవ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి గోస్కుల అజయ్, నగర హాస్టల్ కన్వీనర్ విజయ్, నాయకులు రాజు,తేజ, ఈశ్వర్, సాయి,ఆకాశ్, కార్తికేయ, అభిషేక్ పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు



మానకొండూర్: మండలంలోని డీబీఎం 6 ఉపకాలువపై ఉన్న కల్వర్టు కుంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు వెంటనే సాగునీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతు పనులు చేపట్టారు. మండలంలోని కెల్లెడ గ్రామ శివారులోని ఉపకాలువపై సుమారు 40 ఏళ్ల క్రితం కల్వర్టు నిర్మించారు. ఇటీవల కల్వర్టు కుంగడంతో స్థానికులు, ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లగా కల్వర్టుపై స్లాబ్ వేసేందుకు మరమ్మతు పనులు చేపట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.